క్లుప్తంగా

నేడు ఎన్నికల ప్రచారం

వల్లూరు : మండలంలోని దిగువపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని దిగువపల్లె, డీ కొత్తపల్లె, మైసూరారెడ్డి కాలనీ, పైడికాలువ పంచాయతీ పరిధిలోని గోసులవారిపల్లె గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహించే ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డిలు పాల్గొంటారని పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోండి



పోలీసు కవాతు నిర్వహిస్తున్న సీఐ నాగరాజు, కేంద్ర బలగాలు

పెండ్లిమర్రి : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కడప రూరల్ సీఐ నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన నల్లయ్యగారిపల్లె, బాలయ్యగారిపల్లె, గొందిపల్లె, చీమలపెంట, జీసీపల్లె గ్రామాలల్లో పోలీసు కవాతు నిర్వహించారు. గ్రామాలల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు.

నడివీధి గంగమ్మ సన్నిధిలో హోమం



కళశాలతో మహిళా భక్తుల ఊరేగింపు

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ క్షేత్రంలో జాతర ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 108 మంది భక్తులు పాండురంగస్వామి ఆలయం నుంచి పవిత్రజలాల కళశాలతో మంగళ వాయిద్యాల మధ్య ఊరేగింపుగా అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. పవిత్రజలంతో అమ్మవారి మూలమూర్తిని అభిషేకించారు. అనంతరం క్షీరం, ఇతర ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేశారు. ఆవరణలో చండీ హోమం నిర్వహించి. పూర్ణాహుతి జరిపారు. అమ్మవారిని భక్తులందరూ దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

నిత్యపూజకోనకు బస్సు సౌకర్యం కల్పించాలి

కడప కల్చరల్ : జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి సోమవారం నిత్యపూజకోనకు బస్సు సౌకర్యం కల్పించాలని తాళ్లపత్ర గ్రంథ పరిశోధకులు నాగదాసరి మునికుమార్ ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. పుష్పగిరి క్షేత్ర రక్షణ కమిటీ ప్రతినిధి ఎస్.భారవితో కలిసి ఆర్టీసీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మంజుల కిరణ్‌కు ఆమె కార్యాలయంలో గురువారం వినతి పత్రం అందజేశారు. సోమవారం ఉదయం 6.30 గంటలకు కడప ఆర్టీసీ బస్టాండులో బయలుదేరి 8 గంటలకు చేరుకునే విధంగా, తిరిగి మధ్యాహ్నం 3 గంటలకు నిత్యపూజకోనలో బయలుదేరి సాయంత్రం 4.30 గంటలకు కడపకు చేరేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండు, మాచుపల్లి బస్టాండు, టక్కోలి, మాచుపల్లి, మూలపల్లి, సిద్ధవటం, వంతాటిపల్లి మీదుగా బస్సును ఏర్పాటు చేయాలని కోరారు.

14న మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్: అగస్త్యేశ్వరాలయంలో 14న ఆదివారం ఉదయం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా లోకకల్యాణార్థం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహిస్తామని భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీలో నగదు సీజ్

కొండాపురం: మండల కేంద్రం పరిధి తాడిపత్రి–కడప బైపాస్ రోడ్డులోని కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.48 లక్షలను సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ జె.చంద్రశేఖర్ తెలిపారు. చిత్తూరు జిల్లా పాలురుకు చెందిన కె.రాజేష్ కారులో నగదు తాడిపత్రి వైపు తీసుకెళ్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

టీడీపీ నేతలవి ఊసరవెల్లి రాజకీయాలు

బి.కోడూరు: వలంటీర్లపై చంద్రబాబుతో పాటు ఆ పార్టీ మండల స్థాయి నాయకులు ఎనలేని ప్రేమను చూపడం హాస్యాస్పదంగా ఉందని మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని మేకవారిపల్లెలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి వరకు వలంటీర్ల గురించి అసభ్య పదజాలంతో ఇష్టానుసారం మాట్లాడి రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించారని ఆరోపించారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

- మసీదు, ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు
- ఈద్ ముబాకర్ (శుభాకాంక్షలు) తెలుపుకున్న ముస్లింలు



పులివెందులలో ప్రత్యేక ప్రార్థనలలో ముస్లిం సోదరులు

పులివెందుల టౌన్ : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని రంజాన్ మాసంలో కఠిన ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు గురువారం రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ విశిష్టతను వివరించారు. అలాగే పట్టణంలోని పార్నపల్లె రోడ్డులో ఉన్న ఈద్గా మైదానంలో పట్టణం, వివిధ ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఆలింగం చేసుకుని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. తమ ఇంటి వద్ద విందు భోజనాలు ఏర్పాటు చేసి బంధు, మిత్రులను ఆహ్వానించారు. అలాగే నూరు బాషా కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ఓతూరు రసూల్ ఆధ్వర్యంలో స్థానిక పార్నపల్లె రోడ్డులోని ఈద్గా వద్ద పేద ముస్లింలకు, యాచకులకు బిర్యానీ ప్యాకెట్లను పంపిణీ చేశారు. రంగనాథస్వామి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామిలు పాల్గొన్నారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని ముస్లిం సోదరులు ఈద్–ఉల్–ఫితర్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి నెలవంక కనిపించడంతో గురువారం ఈద్–ఉల్–ఫితర్ పండుగను నిర్వహించు కోవాలని మత పెద్దలు పిలుపునిచ్చారు. దీంతో పట్టణానికి చెందిన ముస్లిం సోదరులు ఉదయమే సాంప్రదాయ దుస్తులు ధరించి, అత్తర్ రాసుకొని, కళ్లకు సుర్మా పెట్టుకొని పెద్ద సంఖ్యలో స్థానిక ఈద్గాకు చేరుకున్నారు. ప్రభుత్వ ఖాజీలు హాఫిజ్ జాహిద్ హుసేన్ నమాజ్ చదివించగా, నాసీర్ హుసేని ప్రత్యేక కుత్బా చదివి వినిపించారు. అనంతరం జాహిద్ హుసేన్ విశ్వ శాంతి కోసం ప్రత్యేక దువా చేశారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరి నొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ తెలుపుకున్నారు. అలాగే స్థానిక దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా నందు పీఠాధిపతి హజరత్ మహమ్మద్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ప్రత్యేక బయాన్ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని ఆశీర్వాదం పొందారు. అలాగే పట్టణంలోని అన్ని మస్జిద్‌లలో ఈద్ నమాజ్ చదువుకున్నారు. మండల పరిధిలోని గంగవరం, విభరాపురం, కోగటం, పందిళ్లపల్లె, ఎర్రగుడిపాడు, మొలకవారిపల్లె, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, లేటపల్లె, పొడదుర్తి, జీవంపేట తదితర గ్రామాల్లో ఈద్–ఉల్–ఫితర్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. తమ సహచరులకు, మిత్రులకు విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

పెద్దముడియంలో..

పెద్దముడియం : మండల వ్యాప్తంగా గురువారం రంజాన్ పర్వదినం పురస్కరించుకుని గ్రామాలలోని ఈద్గాలలో ముస్లిం సోదరులు ప్రత్యేక పార్థనలు చేశారు. ఈద్గాల వద్ద మత గురువులు అందించిన సందేశాన్ని విన్నారు. మండలంలోని పెద్దపసుపుల, పెద్దముడియం, పాలూరు, సుద్దపల్లె, గుండ్లకుంట, నెమళ్లదిన్నె గ్రామాలలో ముస్లింలు భక్తి భావంతో రంజాన్ పార్థనలు నిర్వహించారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మండల కేంద్రంతో పాటు గురిజాల, బిదినంచెర్ల, కోవరంగుట్టపల్లె, బలపనూరు తదితర గ్రామాల్లోని ఈద్గా మైదానాలలో ముస్లిం సోదరులు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులైన మల్లావలి, మహమ్మద్‌రఫీ, ముళ్ల నాగూర్ ముస్లింలకు ఎంతో పవిత్రమైన మాసం ఈ రంజాన్ మాసమని, అలాగే ఖురాన్ అవతరించిందన్నారు. ఈ మాసంలో బీదవారికి నమాజ్‌కన్న ముందే పిత్రదానం చేయాలని, అలాగే తమ సంపదలో కొంత జకాత్ ఇవ్వాలని బోధించారు. అనంతరం గ్రామాల సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలుపడి పంటలు బాగా పండి ప్రతి కుటుంబం సుఖశాంతులతో ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

లింగాలలో..

లింగాల : మండలంలో రంజాన్ వేడుకలను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. మండలంలోని లింగాల, వెలిదండ్ల, పార్నపల్లి, పెద్దకుడాల, ఇప్పట్ల, మురారిచింతల, అంబకపల్లె, తదితర గ్రామాల్లో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ముస్లిం సోదరులు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : పట్టణ పరిధిలోని ముస్లిం సోదరులు వలసపల్లి రోడ్డులో ఉన్న ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పట్టణ సీఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. అలాగే చిలంకూరు, కలమల్ల, తిప్పలూరు పోట్లదుర్తి తదితర ప్రాంతాలలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు, గంగిరెడ్డిపల్లె, అనిమెల, ఎన్.పాలగిరి, నేలతిమ్మాయపల్లె, యు.రాజుపాలెం తదితర గ్రామాల్లో గురువారం ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను నిర్వహించారు. ఈద్గాల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

వేములలో..



కమలాపురంలో ఈద్–ఉల్–ఫితర్ నమాజ్‌కు హాజరైన ముస్లింలు



పెద్దపసుపుల గ్రామంలో పార్థనలు చేస్తున్న ముస్లింలు



సింహాద్రిపురంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



లింగాల ఈద్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



ఎర్రగుంట్లలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



యు.రాజుపాలెంలోని ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు

వేముల : మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు రంజాన్ పండుగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. వేముల, వేల్పుల గ్రామాల్లో రంజాన్ పండుగను పురష్కరించుకుని ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వేములలో కోఆప్షన్ సభ్యులు మండి మాపీరా, మాజీ ఎంపీటీసీ మదార్‌సావలి, గౌస్‌పీరాలు ఇచ్చిన విందులో వైఎస్సార్సీపీ మండల ఇన్‌చార్జి నాగెళ్ల సాంబశివారెడ్డి, జడ్పీటీసీ కె.వెంకటబయపురెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు డైరెక్టర్ మరక శివకృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : రంజాన్ పర్వదిన వేడుకలను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గురువారం తాడిపత్రి రహదారిలోని ఈద్గా ఆవరణలో భారీ సంఖ్యలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు రంజాన్ ప్రాముఖ్యాన్ని వివరించారు.

వేంపల్లెలో..

వేంపల్లె : స్థానిక ఉర్దూఘర్ షాదీఖానా సమీపంలో ఉన్న ఈద్గాలో భక్తిశ్రద్ధలతో ముస్లిం సోదరులు సామూహిక ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ముస్లిం సోదరులు వైఎస్సార్ సర్కిల్ సమీపంలో ఉన్న మార్కస్ మసీదు నుంచి ర్యాలీగా ఈద్గాకు చేరుకున్నారు. మదీనాపురం, బిస్మిల్లా మసీదులో ప్రార్థనలు చేయడంతో అక్కడికి కూడా వెళ్లారు.

వల్లూరులో..

వల్లూరు : మండలంలోని వల్లూరు, కోట్లూరు, తోల్ల గంగనపల్లె, దిగువపల్లె తదితర గ్రామాలలో ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈద్గాలకు వెళ్లారు. పెద్దపుత్త, గణేష్‌పురం, ధర్మాపురం కాలనీ, పైడికాలువ, తప్పెట్ల తదితర గ్రామాలలోని ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. బంధు మిత్రులతో విందులతో కళకళలాడాయి.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం, వెల్లటూరు, గంగనపల్లె, కొండూరు, మెయిళ్లకాల్వ గ్రామాల్లోని ముస్లిలు ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో, నవాజ్ కట్ట వద్ద వేరువేరుగా ముస్లిం ప్రత్యేక ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతులు సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ, సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీలు మహమ్మద్ ప్రవక్త కాలం నుంచి నిరుపేదలను ఆదుకోవడం కోసం తాము సంపాదించిన ధనంలో కొంత తీసి నిరుపేదలకు జకాత్ రూపంలో దాన ధర్మాలను చేస్తారన్నారు. అనంతరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో సయ్యద్‌షా తాహిర్‌పీరాఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.



ముద్దనూరులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



వేంపల్లెలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు



పెద్దపుత్త మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



జమ్మలమడుగులో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

నేడు బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం

పులివెందుల టౌన్ : పట్టణంలోని భాకరాపురం వైఎస్సార్ ఆడిటోరియంలో శుక్రవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో బలిజ సంఘీయుల ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణ దేవరాయ బలిజ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాచనేని ఆంజనేయులు, సంఘ పెద్దలు తెలిపారు. పులివెందుల తాలూకాలోని బలిజ సంఘీయులు ప్రతి ఒక్కరు ఉదయం 10 గంటలకు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డిలు పాల్గొంటారన్నారు.

జగనన్నకే ఓటేద్దాం



పాతసంగటిపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రమ్యతారెడ్డి

పెండ్లిమర్రి : రాష్ట్రంలో ప్రతి ఇంటికి మేలు చేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ఓట్లు వేసి గెలిపిద్దామని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి కుమార్తె డాక్టర్ రమ్యతారెడ్డి కోరారు. గురువారం సాయంత్రం పాత సంగటిపల్లె గ్రామ పంచాయతీలోని చెన్నంరాజుపల్లె, చెన్నంరాజుపల్లె దళితవాడ, కోనాయపల్లె, పాతసంగటిపల్లె, పాతసంగటిపల్లె దళితవాడ గ్రామాల్లో ఆమె ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఏ ప్రభుత్వంలో అయితే మీకు మేలు జరిగిందో వారికే ఓటు వేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థి పి.రవీంద్రనాథ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఎంపీపీ వరలక్ష్మి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, పాలతల చైర్మన్ నాగమల్లారెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, సర్పంచ్ సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ జెడ్పీటీసీ బాస్కర్, మనోహర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, చెన్నారెడ్డి, అదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల

ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే



పులివెందులలో జ్యోతిరావు పూలే చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి



జమ్మలమడుగులో పూలేకు నివాళులు అర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

పులివెందుల టౌన్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే అని మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్ రాజారెడ్డి భవన్ (పాత ఎమ్మెల్యే)లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల అసమానతలపై పోరాటం మొదలు పెట్టి అవిశ్రాంతంగా పోరాడిన ధీరుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. జ్యోతిరావు పూలే సామాజిక తత్వవేత్తగా సమాజంలో అనేక విధాలుగా ప్రజలను చైతన్యపరిచారన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, నూరుబాషా కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ ఓతూరు రసూల్, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ అంబకపల్లె నారాయణస్వామి, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి డేనియల్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : ముద్దనూరు రహదారిలో ఉన్న పూలే విగ్రహానికి ఎఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచుక బాబు పూలమాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. బహుజనులకు విద్యను బోధించి భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి ప్రధాత పూలే అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిన్నయ్య, నరసింహులు, ఓబులేసు, మారెన్న రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా మండలంలోని డాక్టర్ ఎంవీఆర్ ఆర్టీపీపీలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాలులర్పించారు. కార్యక్రమంలో ఆర్టీపీపీ సీఈ గౌరీపతి, ఎస్ఈలు, డీఈలు, ఏఈలు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి వైఎస్ జగన్‌తోనే సాధ్యం



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి



జమ్మలమడుగులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అది వైఎస్ జగన్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సంగాలపల్లెలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించి సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని పథకాలు కొనసాగాలంటే రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబునాయుడు చేస్తున్న అబద్ధపు హామీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. తెలుగుదేశం నాయకులు తమ ఉనికిని కాపాడుకునేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వారి మాటలు నమ్మొద్దని తెలిపారు. తెలుగుదేశం అధికారంలోకి రాదన్న విషయాన్ని వారికి తెలుసన్నారు. గతంలో టీడీపీలో కొనసాగుతున్న వారికే కండువాలు వేసి అనేక కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారని పత్రికల్లో రాయించుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, స్థానిక నాయకులు శ్రీనాథ్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసుల్‌రెడ్డి, నారాయణరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోసం చేసేవారిని నమ్మొద్దు

జమ్మలమడుగు : రాజకీయ అవసరాలకోసం ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసేవారిని నమ్మవద్దు అని ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ప్రజలను కోరారు. గురువారం ఆయన పట్టణంలోని నాగులకట్ట ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రజలకు చెప్పిన హామీలన్నీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. టీడీపీ పాలనలో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీ చేయలేదన్నారు. రాబోయే ఎన్నికల్లో తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ సింగరయ్య, కత్తి శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ ఆగస్టీన్ రాజు, మార్బల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమని పులివెందుల మండల వైఎస్సార్సీపీ ఇన్‌చార్జి దుశ్యంత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని అచ్చవెల్లి గ్రామంలో వైఎస్సార్సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ రామమల్లేశ్వరరెడ్డి, నూరుబాషా కార్పొరేషన్ చైర్మన్ రసూల్, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, ఎంపీటీసీ బాంధవి, ఎంపీటీసీ విశ్వనాథరెడ్డి, సర్పంచు వరలక్ష్మిదేవి వైఎస్సార్సీపీ నాయకులు, ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, వీరభద్రారెడ్డి, గంగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, చిన్నపురెడ్డి, జనార్దన్‌రెడ్డి, అజయ్, రమేష్, పుష్పనాథరెడ్డి, అజ్జుగుట్టు భాస్కర్‌రెడ్డి, బలరామిరెడ్డి, డిష్ వెంకటరెడ్డి, అచ్చవెల్లి గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



శిల్పారామంలో నృత్యప్రదర్శనలో చిన్నారులు



వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో నృత్యాలు చేస్తున్న చిన్నారులు

పులివెందుల టౌన్ : రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని గురువారం సాయంత్రం శిల్పారామంలో సంబరాలు అంబరాన్ని అంటాయి. శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షణలో శ్రీరాజా కళానిలయం శిష్యబృందంచే నిర్వహించిన జానపద, శాస్త్రీయ నృత్యాలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. రంజాన్ పండుగ కావడంతో ముస్లింలు పెద్ద సంఖ్యలో శిల్పారామాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న ఊయలలు, జారుడుబల్లలు, బోటింగ్ షికార్లు చేస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు.

వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో..

రంజాన్ పండుగ సందర్భంగా డాక్టర్ వైఎస్సార్ లేక్ ఫ్రంట్‌లో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. పులివెందుల మహేష్ ఎస్కే ఫిల్మ్, స్టూడియో దీక్షు ఈవెంట్స్ ఆర్కెస్ట్రా సంయుక్తంగా జానపద, స్కిట్స్, సినీ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ముస్లిం సోదరులు లేక్ సందర్శనలో ఒకరికొకరు ఈద్‌ముబారక్ తెలుపుకున్నారు. హీరో పులివెందుల మహేష్, ఏపీ04 రామాపురం హీరో రామ్‌జాక్కల, యాంకర్స్ సాయి ఈశ్వరి, సాత్విక, హనీలచే కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో డ్యాన్స్ మాస్టర్‌లు రాజా, శర్వ తదితరులు పాల్గొన్నారు.